

## పదకొండేళ్ల చిన్నారికి 50 ఏళ్ల వ్యక్తి గుండె

గుండె మార్పిడి శస్త్రచికిత్సను తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్న పిల్లల హృదయాలయం వైద్యులు మంగళవారం విజయవంతంగా పూర్తిచేశారు. తితిదే ఆధ్వర్యంలోని ఈ ఆసుపత్రిలో గుండె వైద్యం, శస్త్రచికిత్సలతోపాటు గుండె మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహించిన గుండెమార్పిడి శస్త్రచికిత్సతో ఆ సంఖ్య పదికి చేరింది. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా వనస్థలిపురానికి చెందిన 11 ఏళ్ల చిన్నారికి గుండెమార్పిడి అవసరమని గుర్తించి అక్కడి వైద్యులు ఇక్కడికి సిఫార్సు చేశారు. నవంబర్ 6న ఇక్కడి వైద్యులు పరీక్షించి జీవన్‌ధాన్ ట్రస్టులో పేరు నమోదు చేయించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన 50 ఏళ్ల వ్యక్తి స్ట్రోక్‌తో బ్రెయిన్ డెత్‌కు గురికావడంతో కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వచ్చారు. శ్రీకాకుళం జేమ్స్ ఆసుపత్రిలో గుండెను సేకరించి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో వైజాగ్‌కు.. అనంతరం తిరుపతికి ప్రత్యేక విమానంలో తీసుకొచ్చారు. ఇందుకు సుమారు మూడుగంటల సమయం పట్టింది. రేణిగుంట విమానాశ్రయం నుంచి గ్రీన్‌ఛానల్ ద్వారా తీసుకువచ్చి అప్పటికే ఆపరేషన్ థియేటర్‌లో సిద్ధంగా ఉన్న ఆస్పత్రి సంచాలకులు డా.శ్రీనాథ్‌రెడ్డి, డా.గణపతి ఆధ్వర్యంలో విజయవంతంగా గుండెమార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు.




## భారీ లాభాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు సూచీల ర్యాలీకి దోహదం చేస్తున్నాయి. ఉదయం 9:24 గంటల సమయంలో సెన్సెక్స్ 400 పాయింట్లు పెరిగి 71,837 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 115 పాయింట్లు పుంజుకొని 21,568 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.17 దగ్గర ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో టెక్ మహీంద్రా, విప్రో, టీసీఎస్, రిలయన్స్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. ఎంఅండ్‌ఎం, మారుతీ, సన్‌ఫార్మా, హెచ్‌యూఎల్, టైటన్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా మార్కెట్ సూచీలు మంగళవారం లాభాలతో ముగిశాయి. నేడు ఆసియా-పసిఫిక్ ప్రధాన సూచీలూ అదే బాటలో పయనిస్తున్నాయి. చమురు ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. హౌతీ మిలిటెంట్లు ఎర్ర సముద్రంలో కొన్ని చమురు నౌకలపై మంగళవారం దాడి చేశారు. దీంతో కొన్ని సంస్థలు తమ నౌకల మార్గాన్ని మార్చాయి. ఈ పరిణామాలతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ బ్యారెల్ చమురు ధర బుధవారం ఉదయం 1.6 శాతం ఎగసి 79.23 డాలర్లకు చేరింది. విదేశీ సంస్థాగత మదుపర్లు మంగళవారం రూ.601.52 కోట్లు విలువ చేసే భారత ఈక్విటీలను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు రూ.294.35 కోట్లు విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు.




## 10 వేలలో పోకో ఎమ్6 5జీ స్మార్ట్ ఫోన్..

మార్కెట్లో వరుసగా బడ్జెట్ ఫోన్స్‌ను లాంచ్ చేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో 5జీ సేవలు విస్తరిస్తున్న క్రమంలో తక్కువ బడ్జెట్‌లో 5జీ ఫోన్స్‌ను తీసుకొస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా చైనాకు చెందిన స్మార్ట్ ఫోన్ దిగ్గజం పోకో భ్యారత మార్కెట్లోకి బడ్జెట్ ధరలో 5జీ స్మార్ట్ ఫోన్‌ను లాంచ్ చేస్తోంది. పోకో ఎమ్6 పేరుతో తీసుకొస్తున్న ఈ 5జీ స్మార్ట్ ఫోన్‌లో ఎలాంటి ఫీచర్లు ఉండనున్నాయి.? ధర ఎంత.? లాంటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..చైనాకు చెందిన స్మార్ట్ ఫోన్ దిగ్గజం పోకో తాజాగా కొత్త ఫోన్‌ను లాంచ్ చేస్తోంది. పోకో ఎమ్6 5జీ పేరుతో ఈ ఫోన్‌ను తీసుకురానున్నారు. డిసెంబర్ 22వ తేదీన భారత మార్కెట్లోకి ఈ ఫోన్‌ను లాంచ్ చేయనున్నట్లు పోకో అధికారికంగా తెలిపింది.ఈ స్మార్ట్ ఫోన్‌ను ప్రముఖ ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్‌లో డిసెంబర్ 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అందుబాటులోకి రానుంది. ఈ స్మార్ట్ ఫోన్ ధర రూ. 10 వేల లోపు ఉండొచ్చని తెలుస్తోంది. ఇక కొనుగోలు సమయంలో పలు బ్యాంక్ కార్డులపై డిస్కౌంట్స్ అందించనున్నారు. ఈ ఫోన్‌ను బ్లాక్, సిల్వర్ కలర్స్‌లో అందుబాటులో ఉండనున్నాయి.ఇక ఈ స్మార్ట్ ఫోన్ ఫీచర్స్ విషయానికొస్తే ఇందులో.. 6.74 ఇంచెస్‌తో కూడిన ఎల్‌సీడీ డిస్‌ప్లేను అందించనున్నారు. 90 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్ ఈ స్క్రీన్ సొంతం. ఇక ఈ ఫోన్‌ను 8 జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజ్‌తో అందించనున్నారు.

## పార్లమెంట్‌లో నిరసన ఘటన.. ఉపరాష్ట్రపతికి మోదీ ఫోన్



పార్లమెంట్ ప్రాంగణంలో జరిగిన నిరసన ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధుల భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఇతరుల మర్యాదకు భంగం కలిగించేలా ఉండకూడదని హితవు పలికారు. అలాగే ఈ ఘటనపై ప్రధాని మోదీ కూడా తనకు ఫోన్ చేశారని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ వెల్లడించారు. దానిపై మోదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని ట్విటర్ వేదికగా తెలియజేశారు. 'పార్లమెంట్ ప్రాంగణంలో చోటుచేసుకున్న నిరసన ఘటనపై ప్రధాని మోదీ నాకు ఫోన్ చేశారు. ఈ పవిత్ర ప్రదేశంలో ఎంపీలు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా తానుకూడా అలాంటి అవమానాలే ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కానీ, పార్లమెంట్ వేదికగా రాజ్యాంగ పదవిలో ఉన్న వారి విషయంలో ఇలా జరగడం దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన నా కర్తవ్య నిర్వహణను అడ్డుకోలేదని మోదీకి వెల్లడించాను. ఇవన్నీ నా మార్గాన్ని మార్చలేవని, నేను రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశాను' అని ధన్‌ఖడ్ ట్వీట్‌లో వెల్లడించారు.

## నౌకలపై దాడులు..
# చమురు సంక్షోభం!



యుద్ధాలతో ఎప్పటికీ అనర్థాలే. ఇది చరిత్ర రుజువు చేసిన సత్యం. వర్తమాన కాలంలో కూడా ఆధిపత్యం కోసం లేదా వనరులను సొంతం చేసుకోవడం కోసం పలు దేశాలు యుద్ధాలకు తలపడుతున్నాయి. వీటి వల్ల కలుగుతున్న ఆస్తి, ప్రాణనష్టాన్ని గురించి అవి ఆలోచించడం లేదు. ఉక్రెయిన్‌పై రష్యా దాడుల్లో నగరాలు, పట్టణాలు భస్మీపటలం అయిపోయి పిల్లలు, మహిళలతో సహా అమాయకులు వేల సంఖ్యలో బలి అవుతున్న దృశ్యాలను ఇప్పటికీ మనం నిరంతర వార్తా స్రవంతులలో చూస్తున్నాం. ఇప్పుడు ఇజ్రాయెల్–హమాస్ దళాల మధ్య సాగుతున్న యుద్ధం, రావణ కాష్టంలా తయారైంది. ఈ యుద్ధానికి ఆజ్యం పోసిన అగ్రదేశాలే ఇప్పుడు శాంతిమంత్రం వల్లిస్తున్నాయి. హమాస్ దళాలకు మద్దతుగా యెమన్‌కి చెందిన హౌతీ ఉగ్రవాదులు ఎర్రసముద్రంలో చమురు నౌకలపై దాడులు జరుపుతున్నారు. చమురు ఉత్పత్తి దేశాల నుంచి చమురును ఇతర ప్రాంతాలకు ఎర్రసముద్రం మార్గం ద్వారానే చమురు రవాణా అవుతుంది. హౌతీ ఉగ్రవాదుల దాడులవల్ల చమురు నౌకలు ఎక్కడివి అక్కడే ఆగిపోతున్నాయి. దీనివల్ల చివరికి చమురు సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది. వీటివల్ల వాటిని ఎగుమతి చేసిన దేశాలకూ, చమురు కోసం ఎదురు చూస్తున్న దేశాలకూ తీవ్ర నష్టం జరుగుతోంది. అంతిమంగా వినియోగదారుల చెంతకు చేరేసరికి చమురు ధరలు ఎన్నో రెట్లు పెరిగిపోతున్నాయి. చమురు ఉత్పత్తి దేశాలకూ, ఎగుమతి దేశాలకూ సాయం అందిస్తున్న అగ్ర దేశాలు లేదా సంపన్న దేశాలు సమస్య పరిష్కారానికి కృషి చేయడానికి బదులు పరిస్థితి ని అడ్డు పెట్టుకుని మరింత దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. అమెరికా తన నౌకల భద్రతకు నావల్ ఆపరేషన్స్‌ని ప్రారంభించింది. వివిధ దేశాలు కూడా ఈ ఆపరేషన్స్‌లో భాగస్వామ్యం అయ్యేట్టు చేయడం కోసం ఆయా దేశాల విదేశాంగ మంత్రులతో అమెరికా రక్షణ మంత్రి లైలాయిడ్ ఆస్టిన్ వర్చువల్ సమావేశాలను నిర్వహిస్తున్నారు. చమురు ధరలు పెరగకుండా చూడటానికి ఈ దాడులను నివారించే మార్గాలపై చర్చలు జరుపుతున్నారు. గతంలో విదేశాంగ విధానం ఆయా దేశాల విధానాల ఆధారంగా రూపుదిద్దుకునేది. ఇప్పుడు ఆయా దేశాలకు ఏమేరకు ప్రయోజనకరమో ఆ రీతిలో ఆ విధానాలు తెరమీదికి వస్తున్నాయి. పెట్టుబడిదారీ, వర్ధమాన దేశాలన్న తేడాలు లేకుండా తమకు ఏమేరకు లాభం చేకూరుతుందో ఆలోచించి ఆమేరకు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యా పెట్టుబడి దారీ దేశాలతో చేతులు కలుపుతోంది. రష్యాని దూరం చేసుకుంటే ప్రమాదమని మిగిలిన దేశాలు రష్యాతో మైత్రికి సంసిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలోనే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల గల్ఫ్ దేశాల్లో పర్యటించారు. యెమన్ తీరానికి దక్షిణంగా గేట్ ఆఫ్ టియర్స్ వద్ద, సూయెజ్ కాలువ ఉత్తరాన ఈ ఉగ్రవాదులు దాడులకు కాచుకుని కూర్చున్నారు. ఈ సమస్యను సమష్టిగా ఎదుర్కోవల్సి ఉండగా, ఎవరి అవసరాలు, స్వార్థం వారివి అన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి దేశాలు. అందుకే అమెరికా రక్షణ మంత్రి యూకే, బహరైన్, కెనడా, ఫ్రాన్స్ దేశాల అధిపతులతో వర్చువల్ సమావేశాలను నిర్వహించారు. హౌతీ ఉగ్రవాదులను కట్టడి చేయకపోతే తీవ్రమైన అంతర్జాతీయ సమస్య అవుతుందనీ, ఈ విషయంలో అన్ని దేశాలూ కలిసికట్టుగా వ్యవహరించాలని ఆయన పిలుపు ఇచ్చారు. చమురు ఎగుమతులు, దిగుమతులు అన్ని దేశాల రాజకీయాలకూ ఇరుసుగా పని చేస్తున్నాయి. వైరి దేశాలను సన్నిహితం చేసుకోవడానికి చమురును తాయిలంగా ఉపయోగించుకుంటున్నాయి. కొన్ని దేశాలు చమురు ఉగ్రవాదానికి పాల్పడుతున్నాయి. అంటే ధరలను పెంచేయడం, వర్ధమాన దేశాలు విలవిలలాడేట్టు చేయడానికి వెనుకాడటం లేదు. హౌతీ ఉగ్రవాదుల దాడుల దృష్ట్యా చమురు నౌకలను రీరూట్ చేయాల్సి వస్తే, అంటే నౌకలు వెళ్తున్న మార్గం నుంచి వెనక్కి రప్పించి మరో మార్గంలో పంపించాల్సి వస్తే, వ్యయం పెరగడం, అంతిమంగా ధరలు పెరగడం అనివార్యం అవుతుందని ఈ రంగంలో అనుభవం ఉన్న వారు చెబుతున్నారు. దీనిని ఒక లాబీ నడిపిస్తోంది.

## డ్రగ్స్ నిర్మూలనలో అందరం కలిసి పోరాడదాం: డీజీపీ రవిగుప్తా




డ్రగ్స్ సరఫరాదారులు, వాడేవాళ్లకు తెలంగాణ డీజీపీ రవి గుప్తా హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేసేందుకు కృషి చేస్తోందని.. ఇలాంటి టైంలో డ్రగ్స్ వినియోగించినా, సరఫరా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనూహ్య పరిణామాల నడుమ.. ఈసీ ఆదేశాలతో డీజీపీగా రవి గుప్తా తాత్కాలిక బాధ్యతలు చేపట్టారు. తాజాగా ఆయన పూర్తిస్థాయిలో కొనసాగించేందుకే తెలంగాణ ప్రభుత్వం మొగ్గు చూపించింది. తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాదకద్రవ్యాల విషయమై హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. డ్రగ్స్ నిర్మూలనలో అందరం కలిసి పోరాడుదామని.. పోలీసులతో కలిసి ప్రజలంతా ముందుకు రావాలని కోరారాయన.

## 'సలార్' దెబ్బకు క్రాష్ అయిన 'బుక్ మై షో'




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, కేజీఎఫ్ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్'. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 22న విడుదల కానుంది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన కోలీవుడ్ బ్యూటీ శ్రుతి హాసన్ నటిస్తుంది. ఇక సలార్ విడుదలకు ఇంకా కొన్ని గంటలే మిగిలి ఉండడంతో చిత్రబృందం అడ్వాన్స్ బుకింగ్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తుండగా.. సలార్ అడ్వాన్స్ బుకింగ్స్ మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. అయితే ఈ బుకింగ్స్ మొదలైన కాసేపటికే బుక్ మై షో వెబ్‌సైట్ క్రాష్ అయ్యింది. ఒక్కసారిగా లక్షలాది మంది ఫ్యాన్స్ బుక్ మై షో వెబ్‌సైట్ ఓపెన్ చేయడంతో ఈ వెబ్‌సైట్ కాసేపు పని చేయలేదు. అయితే ఈ క్రాష్ అయిన ఫోటోలను నెటిజన్లు స్క్రీన్ షాట్స్ తీసి సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేశారు. ఇక ఈ లిస్ట్‌లో బాహుబలి చిత్ర నిర్మాత శోభు యార్లగడ్డ కూడా ఉండడం విశేషం.



## ఆర్టీసీ బస్సుల్లో ఒకేరోజు 51.74 లక్షల మంది ప్రయాణం

ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల్లో నిల్చునే పరిస్థితీ ఉండటం లేదు. పథకం ప్రారంభమైన తర్వాత సోమవారం రోజు రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఏకంగా 51.74 లక్షల మంది ప్రయాణాలు చేశారు. పాసులు ఉన్న వారిని మినహాయిస్తే 48.5 లక్షల మందికి ఆర్టీసీ టికెట్ జారీ చేసింది. వీరిలో 30.16 లక్షల మంది మహిళలు కావడం గమనార్హం. మహాలక్ష్మి పథకం ప్రారంభానికి ముందు మొత్తం ప్రయాణికుల్లో సుమారు 40 శాతం వనితలు ఉండేవారని ఇప్పుడు ఆ సంఖ్య 60 శాతానికి చేరిందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

## గ్లామరస్ లుక్‌లో సాక్షి మాలిక్

ఈ లుక్‌ని ఇష్టపడుతున్నారు.సాంగ్ బమ్ డిగ్గీ డిగ్గీలో సాక్షి మాలిక్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. ఈ పాట కారణంగా ఆమె అభిమానులు ఆమెను ఇష్టపడుతున్నారు. సాక్షి మాలిక్ తన బోల్డ్ మరియు హాట్ చిత్రాలను పంచుకోవడం ద్వారా నిరంతరం వార్తల్లో ఉంటుంది. నటి ఈ కొత్త లుక్‌లో చాలా హాట్‌గా కనిపిస్తోంది. ఆమె ఈ రూపాన్ని అభిమానులు ఇష్టపడుతున్నారు.

